# బిఆర్ఎస్ కనిపించేది సోషల్ మీడియాలోనే

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపై మంత్రి సీతక్క

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో మినహా తెలంగాణ సమాజంలో లేదని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నిరూపించిందనీ, కాంగ్రెస్‌కు అపూర్వ విజయాన్ని కట్టబెట్టిన ఓటర్లకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నామనీ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని, అనంతమైన అబద్దాలకు ప్రజలు చెప్పిన గుణపాఠం ఈ ఎన్నికల ఫలితం అని ఆమె నిర్వహించారు. ఈ విజయం కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు. ఘన విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు అభినందనలు అని పేర్కొన్నారు. ఇది చారిత్రాత్మక విజయం ఎప్పటికి చరిత్ర గుర్తుపెట్టుకునే గెలుపు ఇది అని ఆమె భాష్యం చెప్పారు. రెండేళ్ల ప్రజా పాలనకు, రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆయన పరిపాలనను లభించిన ఆమోదం ఇదనీ ఆమె తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల పాపాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి రెండేళ్లు అయినా ప్రజలు బిఆర్ఎస్ మోసాలను నయవంచనను మరిచిపోలేదని ఆమె అభిప్రాయపడ్డారు. దోపిడీ సొమ్ముతో సోషల్ మీడియాలో విచ్చలవిడిగా తప్పుడు ప్రచారం చేశారు. అయినా ప్రజలన నమ్మలేదని తెలిపారు.

# బిఆర్ఎస్‌కు చెంపపెట్టు తీర్పు నిచ్చిన జూబ్లీహిల్స్ ప్రజలు

## ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులకు చెంప పెట్టు లాంటి స్పష్టమైన తీర్పును జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇచ్చా రని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అన్న కెటిఆర్ ఇప్పుడు తన ముఖాన్ని ఎక్కడ పెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోండి తప్పుడు ఆరోపణలు మాని అభివృద్ధికి సహాకరిం చండి అని హితవు చెప్పారు. జూబ్లీహిల్స్‌లో గెలిచిన నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు, అభినందనలు అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ శ్రేణులకు అభినందనలనీ తెలిపారు. ఎర్రగడ్డ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టి కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు అన్నారు.

# బిఆర్ఎస్ అసత్య ప్రచారాన్ని జనం నమ్మలేదు: విహెచ్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి జరగలేదు అని బిఆర్ఎస్ చేసిన ప్రచారాన్ని ప్రజలు నమ్మ లేదనే మాజీ పిసిసి అధ్యక్షుడు మాజీ ఎంపి హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో జూబ్లీ హిల్స్ ఫలితాలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో గెలుపు కార్య కర్తల విజయం, బిసిల విజయం ప్రజాపాలన విజయం అని అభివర్ణించారు. రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసిందని ప్రజలు నమ్మారని ఆయన తెలిపారు. సన్న బియ్యం పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉంది చెప్పారు. భవిష్యత్‌లో జరిగే అన్ని ఎన్నికలు కాంగ్రెస్ విజయానికి ఇదే పునాది అని ఆయన జోస్యం చెప్పారు.

# జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు చరిత్రాత్మకం

## కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొనగాల మహేష్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, రెండేళ్ల ప్రజాపాలన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలు ఆశీర్వదించి, రికార్డు మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలిపించిన తీరు చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతి నిధి కొనగాల మహేష్ కొనియాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 24,729 భారీ మెజారిటీ సాధించిన సందర్భంగా, ఈ విజ యంలో సోమాజిగూడ డివిజన్‌లో ఇన్‌చార్జిగా అత్యధిక లీడ్ అందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుని, సచివాలయంలో కలిసి మహేష్ శుభాకాంక్షలు తెలి పారు. జూబ్లీహిల్స్ చారిత్రాత్మక విజయం స్ఫూర్తితో రాబోయే రోజుల్లో లోకల్ బాడీ, జి.హెచ్.ఎం.సి.ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గాంధీభవన్‌లో అంబరాన్ని అంటిన సంబురాలు

**హైదరాబాద్ నవంబరు 14,ప్రభాతవార్త :** గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు జరిపారు. శుక్రవారం తొలి రౌండ్‌లో స్వల్ప ఆధిక్యత కలిగినప్పటికి కాంగ్రెస్ శ్రేణులు గెలుపు తథ్యం అనే భావంతో పెద్ద ఎత్తున బాణసంచా, స్వీటుబాక్సులు పూలబోకెలతో గాంధీభవన్‌కు చేరుకొన్నారు.



గాంధీభవన్‌లో డప్పులు వాయిద్యాల హోరుతో సందడి నెలకొంది. మహిళా కార్యకర్తలు నృత్యాలు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. జూబ్లీహిల్స్ లో ఘన విజయాన్ని ఖాయమని తేలడంతో ఇంకా అనేక ప్రాంతాల నుంచి కార్యకర్తలు గాంధీ భవన్ కు చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాలతో సంబరాలు రాత్రి వరకు చేశారు.

# రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది

## కెసిఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు

## భూకంపం వంటి ఫలితాలు బిజెపి చూడాలి: సిఎం రేవంత్‌రెడ్డి



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మహేష్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి తదితరులు.

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 14, ప్రభావవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితం, మెజార్టీ రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన నవీన్‌యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, షబ్బీర్‌అలీ, ఎంపీ అనీల్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, నవీన్‌యాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. భారీ మెజా ర్టీని అందించిన జూబ్లీహిల్స్ ప్రజలకు ఆయన కృతజ్ఞ తలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతుందన్నారు. నవీన్‌యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను నిశితంగా పరిశీలి స్తున్న ప్రజలు తీర్పునిస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 51 శాతం ఓట్లు వచ్చాయన్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వ దిస్తున్నార న్నారు. నగరాన్ని సమస్యల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నా డన్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ఓట్లు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలని, ఆయన శైలిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తీరు మారకుంటే భూకంపం వంటి జూబ్లీహిల్స్ ఫలితాలు బీజేపీ ఎదుర్కో వాల్సి ఉంటుందన్నారు. కేటీఆర్ అసూయ తగ్గించు కోవాలన్నారు. పదవులు ఎవరికి శాశ్వతం కాదని, ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉందని హితవు పలికారు. ఫేక్ వార్తలు, ఫేక్ సర్వేల భ్రమలో బతకొద్దని అన్నారు. ఎంఐఎంకు, ఓవైసీకి కాంగ్రెస్ పక్షాన ధన్య వాదాలు తెలియజేశారు. బీహార్ ఫలితాలను సమీక్షించ లేదని, స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ నెల 17న కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుం టామన్నారు. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరన్నారు. ఆయన గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవ సరం లేదన్నారు. పదేళ్లపాటు కాంగ్రెస్ పాలిస్తుందని, కచ్చితంగా మార్పు చూపిస్తామని సిఎం స్పష్టం చేశారు.

# రేవంత్ నేతృత్వం.. మహేష్ వ్యూహంతో విజయం

## 'ఎక్స్' వేదికపై కాంగ్రెస్ పార్టీ

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ వ్యూహాలకు ప్రజానుకూల ఫలితమే జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక విజయమనీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్గాలు 'ఎక్స్' వేదికపై స్పందించాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఈ చారిత్రాత్మక విజయం, రాష్ట్రంలో ప్రజాభిమానాన్ని ప్రతిబిం బిస్తోందని టిపిసిసి వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృ త్వంలో, పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకంలో సమన్వయం, వ్యూహాత్మక ప్రణాళికలు ఈ విజయానికి ప్రధాన కారణమని నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. టిపిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన మొదటి ఉప ఎన్నికలోనే పార్టీకి గ్రాండ్ విక్టరీ అందించడం మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పిసిసి చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఆఫీస్ బేరర్స్‌తో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, స్పష్టమైన దిశా నిర్దేశంతో గెలుపు దిశగా నడిపించారు. ఎన్నికల ప్రక్రియ అంతటా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రేయింబవళ్ళు శ్రమించి, ప్రతీ బూత్, ప్రతీ డివిజన్ స్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పోల్ మేనేజ్మెంట్‌ను కచ్చితమైన శైలి లో మలిచారు. ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమన్వయం, సిఎం-టిపిసిసి చీఫ్ కలిసి నిర్వహించిన తరచు జూమ్ సమావేశాలు, నేతలతో నిరంతర కమ్యూనికేషన్ ఈ విజయాన్ని మరింత బలపరిచాయి. పార్టీ వ్యూహాలు, ఏరియావైజ్ పర్యవేక్షణ, గ్రౌండ్ లెవెల్‌లో కేడర్‌కు ఇచ్చిన దిశానిర్దేశం అన్ని కలిసి పనిచేయడంతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించగలిగింది. పోల్ మేనేజ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో టిపిసిసి చీఫ్ పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. ఈ విజయం రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచుతున్న విశ్వాసానికి నిదర్శనం కాగా, రాబోయే రోజుల్లో కూడా సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడానికి ఈ ఫలితం ప్రేరణగా మారనుంది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం పట్ల కూనంనేని హర్షం

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజ యం సాధించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞతతో ఓటు వేసిన ఓటర్లకు అభినం దనలు తెలిపారు. ఎన్నికల ఫలితాన్ని గమనిస్తే ప్రజా సమస్యల పరిష్కారం అంశంపైనే ఓటర్లు ఓటు వేసినట్లు స్పష్టమవు తుందన్నారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన సొంత పార్టీ బిజెపి అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం ప్రజలు ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం చూపుతున్న విషయాన్ని సూచిస్తుందని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మరింత బాధ్యతగా సమస్యల పరిష్కారం, హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియ జేశారు. బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డిఎ సాధించిన విజయం ఆ కూటమిది కాదని ఎన్ని కల సంఘానిదేనని కూనంనేని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముంగిట ఆ రాష్ట్రంలో 75 లక్షల మంది మహిళల బ్యాంక్ ఖాతాలలో నితీష్‌కుమార్ ప్రభుత్వం రూ. 10 వేలు నగదు బదలీ చేసినా ఎన్నికల సంఘం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

# మరో పదేళ్లు కాంగ్రెస్‌వే


## అందుకు ఈ ఫలితాలే నిదర్శనం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ నవంబరు 14,ప్రభాతవార్త :** తెలం గాణలో మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందనేందుకు ఈ ఫలితాలే నిదర్శనమని జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రు లందరం సమష్టిగా పనిచేసి ఉపఎన్నికల్లో విజ యం సాధించామని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసిన వారికి అందు బాటులో ఉండే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలోని ప్రజాపాలనకు పట్టం కట్టిన జూబ్లీ హిల్స్ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రహ్మత్ నగర్ డివిజన్ ప్రజలు ఇచ్చిన మాట ప్రకారం భారీ మెజార్టీ ఇచ్చారనీ, వారికి హృదయ పూర్వక ధన్య వాదాలు తెలిపారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా తన పిలుపు మేరకు కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు పలికిన సినీకార్మికులకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. బూత్‌ల వారీగా వరుస సమీక్షలు నిర్వహించి..తాను చేసిన ప్రతి సూచన పాటిస్తూ..పోల్ మేనేజ్మెంట్లో సమన్వయంతో పనిచేసి ఓట్లు రాబట్టిన కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎన్ని ఆరోపణలు చేసిన, రౌడీ అంటూ ఎంతో అవమానించిన ధైర్యంగా నిలబడి ఘన విజయం సాధించిన మా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

# గెలుపోటములు.. ఇవీ కారణాలు!

## ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులు ఎవరేమన్నారంటే..



కౌంటింగ్ కేంద్రంలో నవీన్‌యాదవ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 14, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు రాజకీయ పార్టీల భవిష్యత్తుకు కొలమానంగా నిలిచాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన ఈ ఎన్నికలు రాష్ట్ర స్థాయిలో ప్రభావం చూపాయి. గెలుపు కోసం అన్ని రాజకీయ పార్టీలు అహారమం శ్రమించాయి. కాగా కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయాన్ని తన ఖాతాలో వేసుకొని నగరంలో జరిగిన ఉప ఎన్నికల్లో రెండో విజయాన్ని నమోదు చేసుకొంది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు స్పందించారు. ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ గెలుపు ఎంతో ప్రత్యేకమైనదని, నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. ఎన్నికలు పూర్తయ్యాయని, ఇక నియోజకవర్గ అభివృద్ధే తన ముందున్న లక్ష్యమని అన్నారు. తనపై దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారని, తన విజయం కోసం కృషి చేసిన సీఎం, మంత్రులు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ చేసిందేమి లేదని, అందుకే ప్రచారంలో ఏమి చెప్పుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టారని అన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారమే తన ఎజెండా అని స్పష్టం చేశారు. మాగంటి సునీత మాట్లాడుతూ.. ఆడబిడ్డపై కుట్రలు చేశారని, రౌడీయిజంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచారని అన్నారు. ప్రజలను బయపెట్టి ఓట్లు వేయించుకున్నారని, నాలుగైదు పార్టీలతో కలిసి పెద్దఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడ్డారని అన్నారు. రౌడీయిజం చేసి గెలిచారని, దీనిని తాను గెలుపుగా భావించడం లేదన్నారు. తన భర్త గోపీనాథ్ ఉన్నప్పుడు ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ల ఆటలు సాగలేదన్నారు. నైతికంగా తానే గెలిచానని, కేసీఆర్ ప్రచారం చేయకపోవడం వల్ల తాను ఓడిపోయానని అనుకోవడం లేదన్నారు. కౌంటింగ్ కేంద్రంలో లోపల తమ పార్టీ నేతలను ర్యాగింగ్ చేశారని, తాము కట్టుకున్న చీరలపై కూడా చిల్లరగా మాట్లాడటం బాధ అనిపించిందన్నారు. జూబ్లీ హిల్స్ అప్పుడే రౌడీయి జనం మొదలైంద న్నారు. ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికల్లో అట్టర్ ఫ్లాఫ్ అయ్యిందని ఆరోపించారు. అయిదో రౌండ్ అనంతరం కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లి పోయిన బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో డబ్బుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. చివరి మూడు రౌండ్లు తమకు అనుకూలంగా ఉంటాయన్నారు. తనకు డిపాజిట్ వస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు.

### కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపునకు గల కారణాలు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపునకు అధిష్టానం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. బలమైన స్థానిక నాయకుడైన నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసుకొంది. యువకుడు కావడం, గతంలో పోటీ చేసి ఓడిపోయినా నియోజక వర్గంలో అందు బాటులో ఉండటం. నవనిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ పేరుతో సామాజిక కార్యక్రమాలు నిర్వహిం చడం. స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం ప్రచా రం. ఎంఐఎం మిత్రపక్షంగా వ్యవహరించడం. ఇతర పార్టీలు, స్వతంత్రులు తోడ్పాటునందించడం. బలమైన బూత్ స్థాయి ఏజెంట్లు, పోల్ మేనేజ్‌మెంట్.

### బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటమికి కారణాలివే..



కెటిఆర్ నిర్వహించిన సమావేశాల్లో ఒకే రకమైన స్క్రిప్ట్ చదవడం, సొంతంగా మనసువిప్పి మాట్లాడలేకపోవడం. పోల్ మేనేజ్‌మెంట్ సరిగా నిర్వహించకపోవడం. స్థానికంగా ఉన్న నాయకులు, కార్యకర్తలతో సరైన సంబంధాలు లేక పోవడం. పార్టీలో ఉన్న కోవర్టులను గుర్తించలేకపోవడం. సరైన బూత్ కమిటీలను వేయలేకపోవడం. కుటుంబపరమైన గొడవలు.

# బిజెపికి దక్కని డిపాజిట్లు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 14, ప్రభాతవార్త:** బీహార్ ఎన్నికల్లో దూసుకు పోయిన బిజెపి రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఘోర పరాభావాన్ని చవిచూసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ సైతం దక్కలేదు. బీజేపి నుంచి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డిని పార్టీ బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో దీపక్‌రెడ్డికి 25,866 ఓట్లు పోలయ్యాయి. అంటే దాదాపు 14.11 శాతం ఓట్లను బీజేపీ దక్కించుకొంది. అనంతరం వచ్చిన ఎంపీ ఎన్నికల్లో కిషన్‌రెడ్డికి 4,73,012 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 45.15 శాతం ఓట్లు రాగా ఇందులో జూబ్లీహిల్స్ నియోజకవర్గం సైతం కీలకపాత్ర పోషించింది. ఈ క్రమంలోనే తన గెలుపుకు కారణమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బీజేపీకి మరింత ఓటు శాతాన్ని తీసుకురావాలని కిషన్‌రెడ్డి భావించారు. ఈ క్రమంలోనే అభ్యర్థి వ్యవహారం ఆలస్యమైనా చివరికి మరోసారి లంకల దీపక్‌రెడ్డిని బరిలోకి దించారు. కిషన్‌రెడ్డితోపాటు కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధ్యక్షులు, రాష్ట్రంలోని ముఖ్య నాయకులు స్టార్ క్యాంపెయినర్‌లుగా వచ్చారు. ఏపీకి చెందిన మంత్రులు సైతం ఇక్కడ ప్రచారంలో పాల్గొన్నారు. అయితే ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు బీజేపీ శ్రేణులను షాక్‌కు గురిచేశాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి కేవలం 17.061 ఓట్లు పోలయ్యాయి. అంటే పోలైన మొత్తం ఓట్లు 1,94,727 ఉండగా అందు లో కేవలం 8.76 శాతం ఓట్లు మాత్రమే బీజేపీకి పోలయ్యాయి. వాస్తవానికి డిపాజిట్ రావాలంటే పోలైన్ ఓట్లలో ఆరోవంతు ఓట్లు అభ్యర్థికి పడాల్సి ఉంటుంది. అంటే దాదాపు 32,455 ఓట్లు దీపక్‌రెడ్డికి పడాలి. కాని దీపక్‌రెడ్డి 17 వేల వద్ద ఆగిపోవడంతో డిపాజిట్ సైతం దక్కడం లేదు. బీజేపీ అభ్యర్థి డిపాజిట్‌పై ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి సైతం సవాల్ విసరడం గమనార్హం. ఈ ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ దక్కించుకుంటే చాలంటూ వ్యంగంగా ఆయన బాణాలు విసిరారు. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు శాతంతో పోల్చుకుంటే దాదాపు 5.35 శాతం బీజేపీకి ఓటు శాతం పడిపోవడం గమనార్హం. బీజేపీ డిపాజిట్ కోల్పోవడం పట్ల ఇప్పుడు పార్టీ శ్రేణులు సైతం తీవ్ర నైరాశ్యంలో ఉన్నాయి.

# నోటాకు 924 ఓట్లు

## బిఆర్ఎస్, బిజెపి తర్వాత నోటాకే

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులల్లో నవీన్‌యాదవ్ గెలుపొందగా, రెండోస్థానం బిఆర్ఎస్, మూడోస్థానంలో బిజెపి నిలిచింది. అయితే ఆతర్వాత స్థానాన్ని నోటా కైవసం చేసుకుంది. ముగ్గురు కాకుండా జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో పలు పార్టీలు, ఇండిపెండెంట్లుగా 55 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో 13 మందికి మూడంకెల ఓట్లు రాగా ఒకరికి సింగిల్ డిజిట్ ఓట్లు పోలయ్యాయి. మిగతా వారికి డబుల్‌డిజిట్‌లో ఓట్లు వచ్చాయి. కానీ వీరందరికంటే.. నోటాకే అధిక ఓట్లు రావడం గమనార్హం. 924 మంది ఓటర్లకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థులెవరూ నచ్చకపోవడంతో.. నోటాకు జై కొట్టారు.

# చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకులతో కలిసి శుక్రవారం చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను హైదరాబాదులోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనరసయ్యతో కలిసి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ...రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, సంక్షోభంలో కోరుకపోయిన చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్టు 14 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, రూ. 33 కోట్లు రుణమాఫీ కోసం

## జౌళి శాఖ కమిషనర్‌కు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విజ్ఞప్తి

విడుదల చేస్తున్నామని వెల్లడించారని గుర్తు చేశారు. చేనేత కార్మికుల రుణ బకాయిల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నందున సరిపడినన్ని నిధులను విడుదల చేసి రైతన్నల మాదిరిగా నేతన్నలను రుణ విముక్తులను చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 527 చేనేత సహకార సంఘాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకపోయాయని, వడ్డీల భారం పెరిగి చాలా చేనేత సంఘాలు మూతపడడంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. చేనేత సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి, బ్యాంకుల ద్వారా కొత్తగా రుణ సహాయం అందించి, మూతబడిన సంఘాలన్నింటినీ తెరిపించాలని కోరారు. సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు 2013లో ఎన్నికల నిర్వహించారని, 2018తో వాటి కాలపరిమితి ముగిసినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. చేనేత సహకార సంఘాల సమాఖ్య "టెస్కో" కు సైతం పాలకవర్గం లేనందున చేనేతల సంక్షేమం పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ .. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ సత్యం తెలిపారు. కమిషనర్‌ని కలిసిన వారిలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాషికంటి లక్ష్మీ నరసయ్య, గౌరవాధ్యక్షుడు వెంకట్ రాములు, అధ్యక్షుడు పెండెం సర్వేశ్వర్, నాయకులు జల్దీ రాములు, కస్తూరి బిక్షపతి, కర్నాటి మారయ్య, సురపల్లి జనార్ధన్, దుడుక ఉప్పలయ్య ఉన్నారు.

## ప్రమాదంలో గాయపడిన కెజిబివి టీచర్లకు

# మెరుగైన చికిత్సను అందించాలి

## రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కెజిబివి టీచర్లకు మెరుగైన చికిత్సను అందించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురవి మండల కెజిబివి టీచర్స్ గాయపడటం చాలా బాధాకరం, దురదృష్టకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి అన్నారు. యాక్సిడెంట్లో సమగ్ర శిక్షా కెజిబివిలోని ఐదుగురి టీచర్స్ క్షతగాత్రులయ్యారని.. ప్రభుత్వం స్పందించి వారికి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. అతివేగంతో వస్తున్న ఇసుక వాహనం నిరక్ష్య వైఖరి వల్ల సమగ్ర శిక్షా కేజీబీవీ ఉద్యోగులు గాయపడడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తూ కుటుంబం గడపలేని స్థితిలో ఉన్న కేజీబీవీ ఉపాధ్యాయురాలికి తక్షణమే ప్రభుత్వం, ఉన్నత అధికారులు స్పందించి సాయం అందించాలని కోరారు. అతి వేగంతో వచ్చి ఆటోని డీ కొట్టిన వాహనంపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డ్స్, ఎక్స్‌గ్రేషియాపై ప్రభుత్వం దృష్టి పెట్టి అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు.

